క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష గ్రామసభలు

కంచికచర్ల: మండలంలోని కంచికచర్ల-1, పరిటాల-2 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష శిబిరాలు గురువారం జరగనున్నాయని ఎంపీడీఓ కె.బాలశంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పాల్గొని ప్రజల సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు. జగనన్న సురక్ష శిబిరంలో లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేస్తారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: మండలంలోని లింగగూడెం, సుబ్బాయిగూడెం, కొల్లికుళ్ల గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష క్యాంప్‌లు జరుగుతాయని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు

నందిగామ పట్టణంలో...

నందిగామ: పట్టణ పరిధిలోని 5 వ నంబరు సచివాలయం వద్ద గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాగల్లులో సచివాలయం వద్ద, ఐతవరం లోని సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

జగ్గయ్యపేట పట్టణంలో...

జగ్గయ్యపేటఅర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో గురువారం రెండు సచివాలయాల్లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు మినీ బైపాస్ రోడ్‌లోని బుద్ధ విహార్ వద్ద 5 వ సచివాలయం, 10 గంటలకు సాయిబాబా గుడి పక్కన ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్ వద్ద 13 వ సచివాలయానికి సంబంధించిన జగనన్న సురక్ష క్యాంపు జరుగుతుందని తెలిపారు. ఈ క్యాంపుల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ క్యాంపుల్లో ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండానే అర్హులైన వారికి కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్, రైస్ కార్డుల్లో మార్పు చేర్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు తదితర 11 రకాల సర్టిఫికెట్లు, సర్వీసులు అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సత్యమ్మ అమ్మవారి హుండీ కానుకల ఆదాయం రూ.13.21 లక్షలు



నందిగామ: భక్తులు సమర్పించిన కానుకల ద్వారా సత్యమ్మ అమ్మవారికి రూ.13.21 లక్షల ఆదాయం సమకూరింది. మండల పరిధిలోని అంబారుపేట గ్రామంలో ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీలను బుధవారం తెరచి దేవదాయ, ధర్మదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో కానుకలను లెక్కించారు. మొత్తం 4 నెలలకు గాను రూ.13,21,007 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ డివిజన్ అధికారి సత్య ప్రసాద్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఆలోకం శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాస్టర్ ధీరజ్ శ్రీకృష్ణకు ఎమ్మెల్యే విష్ణు అభినందన



మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. ఇటీవల ఉత్తరాఖండ్ రిషికేష్ లో జరిగిన 4వ అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్ లో పసిడి పతకాన్ని కైవసం చేసుకున్న నగరానికి చెందిన దేవరాజుగట్టు ధీరజ్ శ్రీకృష్ణను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు బుధవారం ఆంధ్రప్రభ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో బాలుడిని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ధీరజ్ లో అద్భుతమైన అభ్యాస సామర్థ్యం, నైపుణ్యం దాగి ఉన్నాయని తెలిపారు. పిన్న వయస్సులోనే అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్‌లో రాణించి 'చాంపియన్ ఆఫ్ చాంపియన్ టైటిల్' ను సొంతం చేసుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ధీరజ్ మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.మురళీకృష్ణ, తల్లిదండ్రులు దేవరాజుగట్టు నాగరాజు, శశికళ ఉన్నారు.

పేదలకు రక్ష..జగనన్న సురక్ష

- అర్హులకు మంచి జరగాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం
- ప్రభుత్వ విప్ ఉదయభాను



పేటలోని 4 వ సచివాలయం క్యాంపులో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పేద వారికి రక్ష జగనన్న సురక్ష అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని నకాశిబజారు శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం జరిగిన 12 వ సచివాలయం, రైల్వే వ్యాగన్ రోడ్‌లో శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన 4 వ నంబరు సచివాలయం జగనన్న సురక్ష క్యాంపుల్లో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఇంకా ఎవరైనా ఉంటే వారికి కూడా అందజేయాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ జగనన్న సురక్ష క్యాంపులను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

టీడీపీ పాలనలో వెల్లువెత్తిన సమస్యల అర్జీలు

గతంలో చంద్రబాబు పాలనలో ప్రజా సమస్యల కోసం ప్రతి ఏటా ఏర్పాటుచేసిన జన్మభూమి సభల్లో రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై సభలకు వచ్చిన ప్రతి ఒక్కరి చేతిలో అర్జీ ఉండేదని, సభ అనంతరం అర్జీలు కుప్పలుగా వెల్లువెత్తేవని ఎమ్మెల్యే ఉదయభాను తెలిపారు. ప్రజలు సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారన్నారు. కాని నేటి జగనన్న పాలనలో రేషన్ కార్డు ఉన్న ఏ ఒక్కరూ నష్టపోకూడదనే లక్ష్యంతో వలంటీర్లు, సచివాలయాల ద్వారా సమస్యలు ఏమైనా ఉన్నాయేమోనని జల్లెడ పడుతున్నారని తెలిపారు. ఫలితంగా ప్రస్తుతం జరుగుతున్న జగనన్న సురక్ష క్యాంపుల్లో ఎక్కడా కనీసం ఒక్క అర్జీ కూడా రావడం లేదని తెలిపారు. పారదర్శకమైన జవాబుదారీ పాలన అంటే ఇదేనన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా 12 వ సచివాలయంలో ఇప్పటికి రూ.13 కోట్లు, 4 వ సచివాలయం పరిధిలో రూ.6 కోట్ల లబ్ధిని చేకూర్చామన్నారు. 4 వ సచివాలయం పరిధిలో విద్యానగర్, ధనంబోడు కాలనీలో సుమారు రూ.4 కోట్లతో సీసీ రోడ్లు వేయించామని, త్వరలో డ్రైన్లు కూడా ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ యువజన నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలరు పాకలపాటి సుందరమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ ఎస్టీ, కార్మిక విభాగాల అధ్యక్షులు బద్దూనాయక్, గోగుల వెంకయ్య పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

కన్నెవీడు(వత్సవాయి): ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న "దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు ఈ కార్యక్రమం వల్ల పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి వచ్చి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాలలో కోటి రూపాయలతో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, చావా దుర్గారాణి, ఎంపీటీసీ లావుడియా మగతానాయక్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, జేసీఎస్ మండల కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి, ఎంపీడీవో చెన్నారావు, తహసీల్దార్ వైకుంఠరావు, ఈవోపీఆర్డీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

జన సంక్షేమానికి జగనన్న సురక్ష



విప్ ఉదయభాను సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గండ్రాయి నాయకులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు, సేవలు ఇంటిముంగిటే అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరంగా మారిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. చిల్లకల్లు గ్రామ సచివాలయం వద్ద బుధవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అధికారులు జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తూ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉందని, మరి కొద్ది రోజుల్లోనే సమస్య పరిష్కరించి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో 900 మందికి సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ చిన్నారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాసగౌడ్, సచివాలయ కన్వీనర్ దొంగల జానకిరామయ్య, సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులకు తడి, పొడి చెత్త డబ్బాలను పంపిణీ చేశారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన తిరుమలశెట్టి సతీష్, పాల్వంచ రమేష్ తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, నాయకుడు కనపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



నందిగామ/పెనుగంచిప్రోలు: ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధి లాంటివారు. ప్రభుత్వ పథకాల్ని లబ్ధిదారులకు అందేలా చేయడంలో వీరి పాత్ర కీలకం. ముఖ్యంగా లబ్ధిదారులకు వలంటీర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. ప్రభుత్వం ఎంతో ముందు ఆలోచనతో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. వలంటీర్లు సైతం ఉద్యోగాన్ని సేవా దృక్పథంతో నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

సేవ చేసే అవకాశం కలిగింది



ఆ భగవంతుడు నాకు సేవ చేసే అవకాశం కల్పించాడు. నా పరిధిలో 86 ఇళ్లు ఉన్నాయి. ఆ ఇళ్లలో 41 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. మేము చేసే కొద్దిపాటి సహాయానికే ప్రజలు మమ్మల్ని ఎంతగానో అభిమానిస్తున్నారు. ఈ ప్రభుత్వం వల్ల నాకు ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది.

– మిరియాల సునీల్ కుమార్, వలంటీర్

వాళ్లు మా సేవకులయ్యా!



వలంటీర్లు నిజంగా మాకు సేవకులయ్యా...మంచానికే పరిమితమైన నాలాంటి వాళ్లకు వాళ్లు చేస్తున్న సేవలకు విలువ కట్టలేం. నాకు ఒక కూతురు. అల్లుడు చనిపోయాడు. నేను, కూతురు, మనవరాలు ఉంటున్నాం. మాది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం నేను పక్షవాతం కారణంగా మంచానికే పరిమితమయ్యా. ఈ నేపథ్యంలో ప్రతి నెలా ఒకటో తేదీ నాడు వేకువ జామునే వలంటీర్ తలుపు తట్టి నాకు పెన్షన్ అందజేస్తున్నాడు. దీంతో పాటు ప్రభుత్వం ద్వారా అందే పథకాలను మాకు వివరించి నా కూతురికి విడో పెన్షన్, మనవరాలికి అమ్మ ఒడి ఇప్పిస్తున్నాడు.

– ఇంద్రకంటి ఆదెమ్మ, ఎస్సీ కాలనీ, నందిగామ

వలంటీర్లు దేవుళ్లు లాగా ఆదుకున్నారు



నా పేరు జక్కులూరి బాబు. మాది పెనుగంచిప్రోలు మండలం కె.పొన్నవరం గ్రామం. కరోనా సమయంలో వలంటీర్లు దేవుళ్లలాగా ఆదుకున్నారు. నాకు మొదటి వేవ్‌లో వచ్చిన సమయంలో కరోనా తీవ్రంగా ఉంది. అసలు ఊళ్లో ఉండనివ్వటం లేదు. కుటుంబ సభ్యులు కూడా దగ్గరకు వచ్చే పరిస్థితి లేదు. ఆ సమయంలో గ్రామానికి చెందిన వలంటీర్లు పర్సా మురళి, కటారపు ప్రసాద్ రోజూ వచ్చి మందులు అందజేసి ధైర్యం చెప్పారు. వారు ఇచ్చిన ధైర్యంతో, మందులతో కరోనా మహమ్మారి నుంచి బయటపడ్డాను. వలంటీర్ల సేవలు అమోఘం. వారి మీద పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలి.

–జక్కులూరి బాబు, కె.పొన్నవరం, పెనుగంచిప్రోలు

వెతుక్కుంటూ వచ్చి పింఛన్ ఇచ్చారు



మాది పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామం. నా పేరు భూలక్ష్మి. నేను దివ్యాంగురాలిని. నేను రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంటే వలంటీర్ ధారావతు పావని ఆసుపత్రికి వచ్చి మరీ పింఛన్ అందించింది. ఆ సమయంలో డబ్బు ఎంతో అవసరం ఉంది. ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి సమయానికి వచ్చి ఆదుకుంది.

–భూలక్ష్మి, శివాపురం, పెనుగంచిప్రోలు

ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకున్న సీఎం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కొణతాలపల్లిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కొణతాలపల్లి(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకుని మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. మంచి చేయాలనే సమున్నత లక్ష్యంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నంద్రు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం



పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మతో ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

పెనుగంచిప్రోలు: పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాల్సిందేనని వలంటీర్లు డిమాండ్ చేశారు. గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు బుధవారం గ్రామంలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మతో ర్యాలీ చేసి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో దహనం చేశారు. అనంతరం వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పవన్‌కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. తమను నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

ఏళ్లనాటి సమస్యలకు తక్షణ పరిష్కారం

- కాండ్రపాడు, తుర్లపాడులో జగనన్న సురక్ష క్యాంపులు
- సర్టిఫికెట్‌లు అందజేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కాండ్రపాడు జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్(చందర్లపాడు): ఏళ్లనాటి సమస్యలు సైతం జగనన్న సురక్ష క్యాంపులో తక్షణం పరిష్కారమవుతున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలంలోని కాండ్రపాడు, తుర్లపాడు గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నెలల తరబడి తిరిగినా లభించని ధ్రువీకరణ పత్రాలు నేడు గంటల వ్యవధిలో చేతికందుతున్నాయన్నారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా తమ సమస్య ఇంత తొందరగా పరిష్కారమవుతుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల సమయంలో తప్ప ప్రజా ప్రతినిధులు ప్రజలకు కనిపించే వారు కాదని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తాము నిత్యం ప్రజలతో మమేకమవుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలనతో ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించటం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండా కృష్ణారెడ్డి, పెర్మసాని నరసింహారావు, బుగ్గినేని సురేష్, తహసీల్దార్ సుశీలదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

16న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్లను ఈ నెల 16వ తేదీన నూజివీడులోని ధర్మ అప్పారావు కళాశాలలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఎస్.సి.బోస్ తెలిపారు. 2010 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారు ఈ ఎంపిక పోటీలకు అర్హులన్నారు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు ఆధార్‌కార్డు, మీసేవా నందు తీసుకున్న జనన ధ్రువీకరణపత్రంతో సంప్రదించాలన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు.

రైల్వే రిజర్వేషన్ కార్యాలయం మార్పు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బెంజిసర్కిల్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్‌లోని రైల్వే రిజర్వేషన్ కార్యాలయాన్ని ఎంజీ రోడ్డు, మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్ వద్ద ఈట్ స్ట్రీట్‌కు మార్చనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రిజర్వేషన్ కౌంటర్‌లో గురువారం ఉదయం 8 గంటల నుంచి కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ప్రజలు ఈ మార్పును గమనించి రైల్వే సేవలు పొందాలని కోరారు.

నగరాలను అన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తించాలి

మంత్రిని కలిసిన నగరాలు కుల ప్రముఖులు



మంత్రి వేణుగోపాల కృష్ణకు వినతిపత్రం అందజేసిన నగరాలు కుల ప్రముఖులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరాలను అన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తించాలని బీసీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను పలువురు నగరాల ప్రముఖులు కోరారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం మంత్రిని బీసీ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ రావు, కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడులతో పాటు పలు నగరాల సంఘాల ప్రతినిధులతో కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. నగరాలను బీసీలుగా అన్ని జిల్లాలో గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఇటీవల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణను కోరడం జరిగిందని, ఈ మేరకు మంత్రిని కలవడం జరిగిందని ఎస్వీ.రావు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో నగరాల ప్రముఖులు తమ్మిన హేమంత్, మజ్జి శ్రీను, బాయన శేఖర్‌బాబు, పైలా సురేష్, ప్రముఖ న్యాయవాది పిళ్లా రవి, పొట్నూరి శివ, బాయన కనకారావు, శీరం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

16న మరో గ్రంథాలయ ఉద్యమ మహాసభ



పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంచికంటి, చలపాక, కలిమిశ్రీ, అరసవిల్లి కృష్ణ తదితరులు

విజయవాడ కల్చరల్: మరో గ్రంథాలయ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో 16వ తేదీ సర్వోత్తమ భవన్‌లో గ్రంథాలయ ఉద్యమ సన్నాహక సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంఘ సభ్యుడు మంచికంటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు రోడ్డు అనేక బుక్ స్టాల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గ్రంథాలయాలను ప్రజలందరికీ చేరువ చేయాలని, భాషా వికాసానికి కృషి చేయాలనే సంకల్పంతో సభ ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 9 గంటలకు సంకల్పయాత్రతో కార్యక్రమాలు ప్రాంభమవుతాయని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలు, కవులు, రచయితలు సమావేశంలో పాల్గొంటారన్నారు. చర్చలు, పుస్తక ఆవిష్కరణల అనంతరం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కవులు, రచయితలు తమ అభిప్రాయం తెలియజేయవచ్చన్నారు. సాహితీవేత్తలు చలపాక ప్రకాష్, కలిమిశ్రీ, మందరపు హైమావతి, అరసవిల్లి కృష్ణ, అలెగ్జాండర్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు. అతిథులు పోస్టర్ ఆవిష్కరించారు.

నేడు వేదాద్రిలో సహస్ర ఘటాభిషేకం

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం సహస్ర ఘటాభిషేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ హేమలతా దేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలోని పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. లోక కల్యాణార్థం పాడిపంటలు సమృద్ధిగా పండాలని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దుర్గమ్మకు సారె సమర్పణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసం సందర్భంగా ఇంద్రకీలాద్రి పై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి అయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్ మహిళలు బుధవారం సారె సమర్పించారు. ఆధ్యాత్మిక ప్రవచకులు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వర శర్మ పాల్గొని మహిళలతో పూజలు చేయించారు. మేళతాళాలు డప్పు వాయిద్యాలతో సారె పట్టుకుని మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శరత్, వసంత శ్రీనివాస్, శైలజ, అరుణ, లీలాకుమారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

శ్రీగాయత్రి బ్రాహ్మణ సంఘ కన్వీనర్‌గా భరద్వాజ్

జగ్గయ్యపేటఅర్బన్: శ్రీగాయత్రి బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా కొమరగిరి భరద్వాజ్ ఎన్నికయ్యారు. స్థానిక గాయత్రీ దేవాలయం కల్యాణమండపంలో బుధవారం జరిగిన నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో మక్కపేటకు చెందిన భరద్వాజ్‌ను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ, అధ్యక్షుడు కలవకొలను వీరాంజనేయశర్మ, కార్యదర్శి మాడపాటి కిషోర్ బాబు, కోశాధికారి చైతన్యశర్మ, మహిళా అధ్యక్షురాలు కొడాలి అపర్ణ పాల్గొన్నారు.